సాక్షి మంచిర్యాల

సోమవారం । 7 । జూలై । 2025



మీసేవలు సులభతరం

రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా సేవలను విస్తృతం చేసేందుకు శ్రీకారం చుట్టింది. అదనపు సేవలు వినియోగదారులకు సులభతరం చేసేందుకు అవకాశం కల్పించింది. 8లో▸



పేరులోనే హైటెక్..

మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ గతుకుల రోడ్లు, డ్రెయినేజీ నీరు పారడం వంటి సమస్యలతో దయనీయ స్థితిలో ఉంది. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.5 /26.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా తొలి ఏకాదశి



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: తొలి ఏకాదశి పండుగను జిల్లావాసులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పూజలు చేశారు. మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయంలోని శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

విద్యుత్ ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం నిర్వహించే విద్యుత్ ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఉత్తమ్ జాడే తెలిపారు. ప్రతీ సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని వివరించారు. విద్యుత్ బిల్లులు, వినియోగంలో అంతరాయం, ప్రమాదాలు, స్తంభాల మార్పు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయచ్చని తెలిపారు.

బాలికల వసతిగృహం తనిఖీ



అన్నం పరిశీలిస్తున్న డీడీ దుర్గాప్రసాద్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి(డీడీ)దుర్గాప్రసాద్ ఆదివారం తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటగది పరిసర ప్రాంతాలను కలియతిరిగారు. నిత్యావసర సరుకులు, రిజిస్టర్ పరిశీలించారు. భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. దుర్గాప్రసాద్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రవీందర్‌గౌడ్, వసతిగృహ సంక్షేమ అధికారి చందన పాల్గొన్నారు.

క్యాప్ స్కాలర్‌షిప్ పోటీలకు ఎంపిక



రిత్విక్

బెల్లంపల్లి: ప్రతిష్టాత్మక క్యాప్ స్కాలర్‌షిప్ క్రీడా పోటీల్లో పాల్గొనడానికి బెల్లంపల్లికి చెందిన ఓ విద్యార్థి ఎంపికయ్యాడు. మహారాష్ట్ర పూణెలోని ఇర్ఫాన్ పఠాన్ క్రికెట్ అకాడమీలో ఇటీవల క్యాప్ స్కాలర్‌షిప్ కోసం విద్యార్థుల ఎంపిక పోటీలు జరిగాయి. బెల్లంపల్లి అశోక్‌నగర్ బస్తీకి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి రెడ్డి.రిత్విక్ అండర్–14 విభాగంలో సత్తా చాటాడు. క్యాప్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించే తుది క్రికెట్ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించాడు. రిత్విక్ మరో మూడు క్రికెట్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఆ పోటీల్లో మెరుగ్గా రాణిస్తే స్కాలర్‌షిప్ పొందడానికి ఎంపికవుతాడు. ఎంపికైన విద్యార్థులకు రూ.2 లక్షల వరకు స్కాలర్‌షిప్ లభిస్తుంది.

హ్యాండ్‌బాల్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి



శృతిని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారిణి పులిశెట్టి శృతి పటియాలలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో హ్యాండ్ బాల్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసిందని హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. శృతి మూడు సీనియర్ నేషనల్‌లో, రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ఒక బంగారు పతకం సాధించిందని పేర్కొన్నారు. కర్రసాములోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బంగారు పతకాలు సాధించిందని వెల్లడించారు. ఆదివారం శృతిని అభినందించారు. అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి అలుగువెల్లి రమేశ్‌రెడ్డి, కోచ్ సువర్కర్ అరవింద్ పాల్గొన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యం..

- భద్రతపై విస్తృత ప్రచారం
- మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు
- జిల్లా విద్యుత్ శాఖ అధికారి(ఎస్‌ఈ) ఉత్తమ్ జాడే

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా డివిజన్ల వారీగా విద్యుత్ భద్రత పై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపడతామని జిల్లా విద్యుత్ అధి కారి(ఎస్‌ఈ) ఉత్తమ్ జాడే తెలిపారు. ఇటీవల జి ల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

సాక్షి: వంగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఎస్‌ఈ: గ్రామాల్లో పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నాం. వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గురించి రైతులు విద్యుత్ సిబ్బందికి తెలుపాలి. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

సాక్షి: ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఎస్‌ఈ: ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా 1912కు కాల్ చేయాలి. నేరుగా కార్పొరేట్ కార్యాలయంలో సమస్య ఫిర్యాదు రికార్డు అవుతుంది. ఏ ప్రాంతంలోని సమస్య అయితే ఆ సంబంధిత అధికారుల, సిబ్బందిని అలర్ట్ చేసి సమస్య పరిష్కరిస్తారు. అధికారులు, సిబ్బంది ఒకానొక సమయంలో అత్యవసర విధులు విద్యుత్ సరఫరా మరమ్మతుల్లో ఉన్నా.. స్పందించక పోయినా కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



జిల్లా విద్యుత్ శాఖ అధికారి(ఎస్‌ఈ) ఉత్తమ్ జాడే

సాక్షి: ఇటీవల విద్యుత్ సరఫరాలో అంతరాయం పెరిగింది. కారణం ఏంటి?

ఎస్‌ఈ: సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు తదితర కొత్త పరికరాలు బిగించడం, వర్షాకాలం కావడం, మరమ్మతులు ఉంటుండడంతో సరఫరాలో కొంత అంతరాయం జరుగుతోంది. ఏదైన ప్రాంతంలో ఒకలైన్ బ్రేక్ డౌన్ అయితే మరో లైన్ ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అంతరాయం లేని మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

సాక్షి: కనెక్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఎందుకు పెండింగ్‌లో ఉంటున్నాయి?

ఎస్‌ఈ: అలా ఏమీ ఉండదు. గతంలో మాదిరి అంతా ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ సిస్టం పెండింగ్ ఉండవు, దరఖాస్తు చేసుకున్న వారికి మెసేజ్ వస్తుంది. సంబంధిత అధికారి, సిబ్బందికి వివరాలు వెళ్తాయి. ఒక వేళ అందుబాటులో లేక పోయినా డోర్‌లాక్, లేదా ఏ వివరాలైన తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలి. స్తంభం నుంచి కనెక్షన్ దూరం ఎక్కువగా ఉంటే అదనపు పోల్ వేయడం, తీగలు, తదితర ఎస్టిమేషన్ వేసి పంపించాల్సి ఉంటుంది.

సాక్షి: వినియోగదారులకు, రైతులకు ప్రమాదాలపై ఎలాంటి సూచనలు చేస్తున్నారు..?

ఎస్‌ఈ: ఇంట్లో నాణ్యమైన పరికరాలు వాడడంతోపాటు, విద్యుత్ వినియోగంలో ఏదైన సమస్య ఏర్పడినప్పుడు అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. విద్యుత్ తీగలకు సమీపంలో బట్టలు ఆరేయవద్దు. రైతులు వానా కాలం పొలాల వద్ద ఏర్పాటు చేసిన బోరు మోటర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి. సొంతంగా మరమ్మతులు చేయొద్దు. విద్యుత్ సరఫరాలో, లేదా ఇతరాత్ర సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి.

సాక్షి: అధికారులు, సిబ్బందిపై అక్రమాల ఆరోపణలు మీ దృష్టికి వచ్చాయా?

ఎస్‌ఈ: ఆరోపణలు కాదు.. సమస్య, ఏదైనా ఇబ్బందులకు గురిచేసిన నా దృష్టికి తీసుకురావాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది, లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1912 కాల్ చేయాలి.

జీపీవోలుగా మరో చాన్స్

- మొదటి విడతలో 85 మంది ఎంపిక
- మరింత మంది నియామకానికి చర్యలు
- విధులు ఖరారు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేసింది. ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ బాధ్యతలను తహసీల్దార్లకు అప్పగించింది. దీంతో రెవెన్యూ వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే, ఈ మార్పులు రైతులకు ఇబ్బందులను తెచ్చిపెట్టాయి. ధరణి పోర్టల్‌పై విమర్శలు రావడంతో, 2023 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా, గతంలోని నిబంధనలను పునరుద్ధరిస్తూ, వీఆర్‌ఏ, వీఆర్‌వోల స్థానంలో గ్రామ పరిపాలన అధికారుల (జీపీవో) వ్యవస్థను తిరిగి తీసుకొచ్చింది.

నియామకానికి పరీక్ష..

జిల్లాలో 16 మండలాలు, 306 గ్రామ పంచాయతీలు, 385 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో వీఆర్‌ఏ, వీఆర్‌ఓలుగా పనిచేసి, ఇతర శాఖల్లో విలీనమైన వారికి ప్రభుత్వం తిరిగి రెవెన్యూ శాఖలో చేరే అవకాశం కల్పించింది. జీపీవోలుగా నియమించేందుకు ఇంటర్, డిగ్రీ అర్హతతో ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించగా, 155 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 132 మంది రాత పరీక్షకు హాజరై, 88 మంది అర్హత సాధించారు. ముగ్గురు ఈ పదవిని స్వీకరించడానికి ఇష్టపడకపోవడంతో, 85 మందిని జిల్లాకు కేటాయించేందుకు సీసీఎల్‌ఏ ప్రక్రియ కొనసాగుతోంది. కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక్కో జీపీవోకు రెండు నుంచి మూడు గ్రామాల బాధ్యతలను అప్పగించే అవకాశం ఉంది.

మరో అవకాశం..

జీపీవో నియామకాలకు ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరోసారి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని ఎంతమంది సద్వినియోగం చేసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ నియామకాలు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడానికి, రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి దోహదపడతాయని అంచనా.

కీలకంగా వ్యవహరిస్తాం..



తిరిగి మాతృ సంస్థలతో రావడం ఆనందంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమకు అవకాశం కలిపించినందుకు కృతజ్ఞతలు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో కానీ, ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కీలకంగా వ్యవహరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తాం.

– సాగె ఓంకార్, జీపీవో, మంచిర్యాల

జీపీవోల విధులు..

జీపీఓలు గ్రామీణ రెవెన్యూ వ్యవస్థలో కీలక బాధ్యతలను నిర్వహిస్తారు. వారి విధుల్లో రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూమిశిస్తు, సెస్, పన్నుల వసూలు, సర్వే రాళ్ల తనిఖీ, జనన, మరణ ధ్రువ పత్రాలు, పహణీ, అడంగల్ పత్రాల జారీ వంటివి ఉన్నాయి. అగ్ని ప్రమాదాలు, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో సమాచారం అందించడం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఓటరు జాబితా తయారీ, శాంతిభద్రతల సమస్యలపై పోలీసులకు సమాచారం అందించడం వంటి బాధ్యతలు కూడా నిర్వహించాలి. అదనంగా, ఇందిరమ్మ, ఉపాధి హామీ వంటి ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు సహకరించడం, వ్యాధుల వ్యాప్తి సమయంలో ఆరోగ్య కేంద్రాలకు సమాచారం అందించడం వంటివి చేయాలి.

పేదల కళ్లలో ఆనందం

- రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్

చెన్నూర్: ప్రజాపాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, పేదల కళ్లలో ఆనందం చూస్తున్నామని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు ఆదివారం ప్రొసీడింగ్ పత్రాలు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి అందించారు. అనంతరం చెన్నూర్ నుంచి హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలకు ఐదు కొత్త బస్సులు ప్రారంభించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌లో చెన్నూర్ నియోజకవర్గంలో 4 వేల ఎకరాలు మునిగి రైతులు నష్టపోయారని తెలిపారు. గత ప్రభుత్వం వారిని పట్టించుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఫేక్ వార్తలు ప్రచారం చేసేవారిపై నిఘా పెట్టాలని పోలీసులకు సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

చెన్నూర్ నియోజకవర్గంలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం సంవిధాన్ లీడర్‌షిప్ ప్రొగ్రామ్–వైట్ టీషర్ట్ ఇనిషియేటివ్ మెమొంటోలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భానుప్రసాద్, మంచిర్యాల డీఎం శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఇంజినీర్ సధాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధరచారి

జన్నారం: తన రేంజ్ పరిధిలో అడవులు, వన్య ప్రాణుల సంరక్షణకు సిబ్బందితో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారి అన్నారు. ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ కలప స్మగ్లింగ్‌పై దృష్టి సారిస్తానన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో అడవులు అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ అధికారిగా బాధ్యతలు..

ఇందన్‌పల్లి రేంజ్ ఇన్‌చార్జి అధికారిగా విధులు నిర్వహించిన కారం శ్రీనివాస్ ఆదివారం తిరిగి జిల్లా టాస్క్‌ఫోర్స్ రేంజ్ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. జన్నారంలోనే హెడ్‌క్వార్టర్‌గా ఉండాలని జిల్లా అటవీ సంరక్షణ అధికారి శివ్ ఆశిష్ సింగ్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

ఆర్కేపీకి.. ఆర్టీసీ బస్సు రాదా?

అదేమీ మారుమూల గ్రామం కాదు.. 40 వేలకుపైగా జనాభా ఉన్న పట్టణం. ఆ పట్టణం నుంచి నిత్యం వందల మంది వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తారు. జిల్లా కేంద్రానికి మంచి రోడ్డు సౌకర్యం కూడా ఉంది. అయినా ఆ పట్టణానికి ఆర్టీసీ బస్సు నడవడం లేదు. దీంతో పట్టణవాసులు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఆటోలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇక మహిళలు మహాలక్ష్మి పథకానికి నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా.. ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించడం లేదు.

- రైల్వే గేటు సాకుతో దశాబ్దాలుగా బస్సు నడవలేదు..
- ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా అదే పరిస్థితి
- జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఆటోలే దిక్కు
- 'మహాలక్ష్మి'కి నోచుకోని రామకృష్ణాపూర్ మహిళలు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణం 40 వేలకుపైగా జనాభా కలిగి ఉంది. ప్రముఖ ప్రాంతమైనప్పటికీ, జిల్లా కేంద్రం నుంచి దశాబ్దాలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. పట్టణానికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, యువకులు, రోగులు, వ్యాపారులు కూలీలు నిత్యం జిల్లా కేంద్రానికి వెళ్లివస్తుంటారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో కొందరు సొంత వాహనాల్లో వెళ్తున్నారు. మిగతావారు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మందమర్రి మార్కెట్ మీదుగా మంచిర్యాలకు అనుసంధానమయ్యే ఈ మార్గంలో బస్సు సౌకర్యం లేకపోవడం పట్టణవాసులకు పెద్ద సమస్యగా మారింది.



పూర్తయిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి(ఫైల్)

రైల్వే వంతెన పూర్తయినా..

గతంలో రామకృష్ణాపూర్–మంచిర్యాల మార్గంలో రైల్వే గేటు కారణంగా ప్రయాణికులు గంటల తరబడి ఆగాల్సి వచ్చేది. ఇటీవల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. ప్రారంభం కూడా జరిగింది. దీంతో దశాబ్దాలుగా లేని ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పట్టణవాసులు భావించారు. కానీ, ఆర్టీసీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు.

'మహాలక్ష్మి'ల నిరాశ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ, రామకృష్ణాపూర్ పట్టణం నుంచి మంచిర్యాలకు వెళ్లే మహిళలు ఈ సౌకర్యానికి నోచుకోవడం లేదు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో, ఈ పథకం ప్రయోజనాలు వారికి చేరడం లేదు. మంచిర్యాల, మందమర్రి మార్కెట్ మీదుగా ఆర్టీసీ బస్సులు కేటాయించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

చుట్టుపక్కల గ్రామాలపైనా ప్రభావం

రామకృష్ణాపూర్ పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామాలైన అమరవాది, సండ్రోనిపల్లె, సారంగపల్లి, తుర్కపల్లి, బీజోన్, ఏజోన్ వంటి ప్రాంతాల ప్రజలు కూడా ఆర్టీసీ బస్సు ప్రయాణానికి నోచుకోవడం లేదు. ఈ గ్రామాల నుంచి జిల్లా కేంద్రం మంచిర్యాలకు రోజువారీగా ప్రయాణించే వందలాది మంది ఇబ్బంది పడుతున్నారు. పట్టనానికి జిల్లా కేంద్రం పది కిలోమీటర్లలోపే ఉన్నా బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ కూడా నష్టపోతోంది.

త్వరలోనే బస్సు నడుపుతాం..

మంచిర్యాల నుంచి రామకృష్ణాపూర్‌కు త్వరలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తాం. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు ప్రతీది ఆన్‌లైన్ అయ్యాయి. అందుకే ఆర్కేపీకి రూట్ క్రియేట్ చేయాల్సి ఉంటుంది. అది పూర్తయిన వెంటనే బస్సు సర్వీస్ నడుపుతాం.

– శ్రీనివాస్, డిపో మేనేజర్, మంచిర్యాల

నిలిచిన ఇసుక రవాణా

- నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం
- పనిలేక కూలీల తిప్పలు

బెల్లంపల్లి: జిల్లాలో 12 రోజులుగా ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో భవన నిర్మాణ రంగంపై ప్రభావం పడింది. ఇళ్ల నిర్మాణాలతోపాటు ఇందిరమ్మ పథకానికి ఇసుక దొరకడం లేదు. ఫలితంగా, రోజువారీ కూలీలు, ట్రాక్టర్ యజమానులు, కాంట్రాక్టర్లు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 400 ట్రిప్పుల ఇసుక బుకింగ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. సరఫరా ప్రక్రియలో జాప్యం కొనసాగుతోంది.

ఖర్జీ రీచ్ ఆధారం..

నెన్నెల మండలంలోని ఖర్జీ రీచ్ జిల్లా ఇసుక రవాణాకు ప్రధాన వనరుగా ఉంది. బెల్లంపల్లి, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, తాండూర్ మండలాల వినియోగదారులకు ఈ రీచ్ నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుక్ చేసుకున్న వారు గత నెల 24 నుండి సరఫరా కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఇసుక బుకింగ్ తాత్కాలికంగా నిలిపివేయడంతో, వినియోగదారులు, ట్రాక్టర్ యజమానులు నిరాశలో ఉన్నారు.

వర్షాలు, సాంకేతిక సమస్యలు..

ఖర్జీ రీచ్‌కు వెళ్లే మార్గంలో వర్షాల కారణంగా వరద నీరు నిలిచింది. ట్రాక్టర్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ కారణంతో ఇసుక రవాణాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే, వరద నీరు లేని ప్రత్యామ్నాయ రీచ్‌లను గుర్తించి, ఇసుక సరఫరాను సాఫీగా కొనసాగించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

ఆన్‌లైన్ బుకింగ్‌లో అవకతవకలు..

ఇసుక బుకింగ్ కోసం ఉపయోగించే ఆన్‌లైన్ యాప్‌లో సాంకేతిక సమస్యలు వినియోగదారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. యాప్ ఎప్పుడు పనిచేస్తుందో, ఎప్పుడు నిలిచిపోతుందో అనిశ్చితి నెలకొంది. దీనికితోడు, కొందరు ట్రాక్టర్ యజమానులు ముందస్తు సమాచారంతో అధిక ట్రిప్పులను బుక్ చేసుకుని ఒక్కో ట్రిప్పునకు రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. రాత్రిపూట వాగులు, వంకల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.



బెల్లంపల్లిలో నిలిచిపోయిన భవన నిర్మాణం

పరిష్కారానికి చర్యలు..

ఇసుక రవాణా స్తంభన కారణంగా భవన నిర్మాణ రంగం తీవ్రంగా నష్టపోతోంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరాను పునరుద్ధరించడానికి మైనింగ్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యామ్నాయ రీచ్‌లను గుర్తించడం, ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థలో సాంకేతిక లోపాలను సరిదిద్దడం, అక్రమ రవాణాను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాగులో నీరు రావడంతో..

ఖర్జీ వాగులో ఇటీవల కొత్తగా చెక్ డ్యామ్ కట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరద ఈ చెక్‌డ్యాంలో నిలిచి ట్రాక్టర్లు రాకపోకలు సాగించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. సిబ్బందిని సోమవారం ఇసుక రీచ్‌కు పంపించి అక్కడి పరిస్థితులు తెలుసుకుంటాం. వరదనీరు ఉంటే.. మరో చోట ఇసుక తవ్వకాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహన్‌రెడ్డి, మైనింగ్ ఏడీ, మంచిర్యాల

జాతీయ వుషూ పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకం చూపుతున్న హాసిని

నస్పూర్: ఈ నెల 1 నుంచి 6 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 24వ జాతీయస్థాయి జూనియర్ వుషూ చాంపియన్‌షిప్ పోటీల్లో నస్పూర్‌కు చెందిన అట్కపురం హాసిని బంగారు పతకం సాధించింది. ఆదివారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనరెడ్డి, వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి బంగారు పతకం అందించారు. హాసిని, కోచ్ శివమహేశ్‌ను వుషూ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకల సతీశ్, ఆవుల రాజనర్సు అభినందించారు.

గోదావరి ఇసుకకు అనుమతి ఇవ్వాలి



నిరసనలో ట్రాక్టర్ యజమానులు

చెన్నూర్: చెన్నూర్ గోదావరి నది నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి ఇవ్వాలని ట్రాక్టర్ యజమానులు అధికారులను కోరారు. ఈమేరకు ఆదివారం ట్రాక్టర్లు నిలిపి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక సీఐ దేవేందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. బతుకమ్మ వాగు ఇసుక నాణ్యత లేక గృహ నిర్మాణదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు ఆన్‌లైన్ పద్ధతిలో గోదావరి ఇసుక తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. నిరసనలో ట్రాక్టర్ యజమానుల సంఘం ప్రతినిధులు అంజన్న, రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ముగ్గురు ఎంపీడీవోలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లోకసభ ఎన్నికల్లో భాగంగా జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలు ఎట్టకేలకు సొంత జిల్లాలకు బదిలీ అయ్యారు. ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయిన అబ్దుల్‌హై, కె.నాగేశ్వర్‌రెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయిన పి.సత్యనారాయణ తిరిగి మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు.

గూడెంలో భక్తుల రద్దీ

దండెపల్లి: దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తొలి ఏకాదశి పండుగ కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సత్యదేవున్ని దర్శించుకుని పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

మెడికల్ బోర్డుపై మంత్రికి వినతి


మంత్రి వెంకటస్వామికి వినతి పత్రం ఇస్తున్న సురేశ్

శ్రీరాంపూర్: సింగరేణిలో జబ్బుపడిన కార్మికుల కోసం ప్రతీనెల సమావేశమయ్యే మెడికల్ బోర్డు ఆరు నెలలుగా జరగడం లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తోకల సురేశ్ తెలిపారు. ఈ మేరకు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి ఆదివారం వినతిపత్రం అందించారు. మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. హయ్యర్ సెంటర్ రెఫరల్ అయిన కార్మికులైతే డ్యూటీలు లేక వేతనాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఓసీపీ కాంట్రాక్ట్ ఉద్యోగాలు 80 శాతం స్థానికులకే ఇవ్వాలని విన్నవించారు. దీనిపై కంపెనీ అధికారులతో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సురేశ్ తెలిపారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతి


నియామకపత్రం అందుకుంటున్న తిరుపతి

పాతమంచిర్యాల: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన దెబ్బెట తిరుపతి నియామకమయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండారి ప్రకాశ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర నాయకులకు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సతీశ్ ఉన్నారు.

ఐలాండ్‌ను ఢీకొన్న బైక్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మిటాకీస్ సమీపంలోని ఐలాండ్‌ను యువకుడు బైక్‌తో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన బీటెక్ చదువుతున్న విద్యార్థి కోడూరి సంజయ్ శనివారం రాత్రి మంచిర్యాల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. లక్ష్మి టాకీస్ సమీపంలో ఐలాండ్‌కు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు పంపించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

చోరీకి పాల్పడిన ఆర్మీ జవాన్ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: చోరీకి పాల్పడిన ఆర్మీ జవాన్‌ను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని పూసద్‌కు చెందిన గైక్వాడ్ అనిల్ రాజేంద్ర చెల్లెలు ఆదిలాబాద్‌లోని విద్యానగర్‌లో ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వచ్చిన ఆయన ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ఐదు ఇత్తడి విగ్రహాలతోపాటు ఒక సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా, ఆదివారం నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్‌రావు వివరించారు.

మీసేవలు సులభతరం

- అదనపు సేవలకు అవకాశం
- వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ల జారీ
- వినియోగదారులకు మరింత సౌలభ్యం

ఉమ్మడి జిల్లాలో మీ సేవ కేంద్రాలు

ఆదిలాబాద్ 80	నిర్మల్ 113
మంచిర్యాల 139	కుమురంభీం 69



మీసేవా కేంద్రం (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా సేవలను మరింత విస్తృతం చేసేందుకు శ్రీకారం చుట్టింది. అదనపు సేవలు వినియోగదారులకు సులభతరం చేసేందుకు అవకాశం కల్పించింది. ఇకపై వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ జారీకి నిర్ణయించింది. ఇందులో భాగంగా సంబంధిత స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రారంభించింది. వివాహ ధ్రువపత్రం కోసం దరఖాస్తుకు ఇరువురు దంపతుల ఆధార్‌కార్డులు వయస్సు పుట్టిన తేదీ, కుల, ఆదాయం ధ్రువపత్రాలు, పదో తరగతి సర్టిఫికెట్‌తోపాటు పెళ్లిఫొటోలు, ఆహ్వానపత్రం జతపర్చాల్సి ఉంటుంది. పెళ్లి చేసుకున్న ప్రాంతం, చిరునామా, వివాహ తేదీ భార్యాభర్తల వ్యక్తిగత వివరాలు, చిరునామా, వృత్తి, కులం, మతం తదితర అంశాలు పొందుపర్చాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుల తల్లిదండ్రుల పేర్లు, సాక్షిల వివరాలు వంటివి అందజేయాలి. న్యాయవాది వద్ద తీసుకున్న నోటరీతోపాటు వివాహం జరిగిన ప్రాంతం ఫంక్షన్‌హాల్ లేదా ఆలయం ద్వారా ధ్రువపత్రాలు సమర్పించాలి. వీటన్నింటిని మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. ఆ తర్వాత తగిన సమయం ప్రకారం స్లాట్‌బుక్ చేసుకుని ఆ తేదీ రోజున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముగ్గురు సాక్షులతోపాటు నవ దంపతులు హాజరుకావాల్సి ఉంటుంది. దరఖాస్తులను సబ్ రిజిస్ట్రార్ విచారణ అనంతరం వివాహ ధ్రువపత్రాన్ని జారీచేస్తారు.

మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్..

ఇంటి స్థలం వైశాల్యం, అపార్ట్‌మెంట్, స్థిరాస్తి ఉన్న ప్రాంతం ప్రకారం ప్రస్తుత మార్కెట్ విలువ నిర్ధారించుకోవడానికి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేయవచ్చు. దరఖాస్తు పరిశీలన అనంతరం సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ఆస్తికి సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువ ధ్రువపత్రాన్ని జారీచేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారుడు ఆధార్‌కార్డ్, ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ స్థలం డాక్యుమెంట్లు, పన్నులు కట్టిన రసీదు గ్రామం, మండలం, జిల్లా వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. తగిన పరిశీలన అనంతరం ధ్రువీకరణపత్రాన్ని జారీచేస్తారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 401 మీసేవ కేంద్రాలు వినియోగదారులకు సేవలందిస్తున్నాయి. 2011లో 10 రకాల సేవలతో ప్రారంభమైన ఈ కేంద్రాలు ప్రస్తుతం 40 శాఖలకు చెందిన 350 రకాల సేవలందిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మరో రెండు రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఆదివాసీ భవన్ ధ్వంసం


ధ్వంసమైన ఆదివాసీ భవన్

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని కుమురం భీం ఆదివాసీ భవన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గేటుతోపాటు భవన్ తాళాలు పగులగొట్టి లోనికి చొరబడి స్టేజీ టైల్స్ ఇతర వాటిని తొలగించారు. విద్యుత్ వైర్లు, బోర్డును అపహరించారు. ఆదివారం సమావేశం ఏర్పాటు చేద్దామని వెళ్లిన ఆదివాసీ నాయకులకు ఇలా కనిపించింది. ప్రశాంతంగా ఉన్న కెరమెరి మండలంలో ఈ చర్యలతో అలజడి ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ఏదైన ఉంటే ముఖాముఖి తేల్చుకోవాలే తప్ప ఇలాంటి చేష్టలకు పాల్పడవద్దని వారు పేర్కొంటున్నారు. ఆకతాయిలు చేశారా? లేదా పెద్దలు వెనకుండి పక్కా ప్లాన్‌తో ఈ తతంగం నడిపించారా అనే అనుమానాలు ఆదివాసీలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి


రూప (ఫైల్)

దండేపల్లి: అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. లక్సెట్టిపేట మండలం సురారం గ్రామానికి చెందిన పొరండ్ల శంకరయ్య కుమార్తె రూప (22)ను దండేపల్లి మండలం గుడిరేవుకు చెందిన అల్లె మహేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి రెండేళ్ల బాబు ఉన్నాడు. మహేశ్ ఉపాధి కోసం పది నెలల క్రితం సింగపూర్‌కు వెళ్లాడు. పెళ్లయిన కొన్నినెలల నుంచే మహేశ్ రూపను వేధింపులకు గురిచేసేవాడు. ఫోన్లలో వేధించసాగాడు. ఈ విషయం రూప తల్లిదండ్రులకు చెప్పడంతో ఇద్దరికి నచ్చజెప్పారు. నాలుగురోజుల క్రితం ఏదో మెసేజ్ వచ్చిందని అత్తమామలు లక్ష్మి, పుల్లయ్య, ఆడబిడ్డ అల్సె మమత, ఆమె భర్త సుమన్‌లు ఆమెను వేధింపులకు గురిచేశారు. భర్త మహేశ్ కూడా ఫోన్‌లో వేధించాడు. ఈ విషయాన్ని రూప తన తండ్రికి ఫోన్‌లో చెప్పి ఎడువడంతో నచ్చజెప్పారు. ఈక్రమంలో రూప శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. గుడిరేవుకు చెందిన కాసారపు సాయికిరణ్ ఈ విషయాన్ని రూప తండ్రికి ఫోన్‌లో చెప్పి లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. వెంటనే శంకరయ్య కుటుంబీకులు అక్కడికి చేరుకున్నారు. రూపను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో అత్తమామలు లక్ష్మి, పుల్లయ్య, భర్త మహేశ్, ఆడబిడ్డ అల్సె మమత, ఆమె భర్త సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూతురు, అల్లుడికి గొడవలు మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

కుబీర్: కూతురు, అల్లుడికి మధ్య గొడవలతో మనస్తాపం చెందిన తండ్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన నీలకంఠ గోవిందు (64)కు భార్య, కుమార్తె నర్మద, అల్లుడు అందరూ ఒకేటో ఉండేవారు. కూతురు, అల్లుడు తరచూ గొడవపడేవారు. దీంతో మనస్తాపం చెందిన నీలకంఠ గోవిందు ఆదివారం ఉదయం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రిష్టారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మల్లేశ్‌గౌడ్ (ఫైల్)

తాండూర్: మండలంలోని బోయపల్లి బోర్డు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై డి.కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..ఓదెలు గ్రామానికి చెందిన అయిలి మల్లేశ్‌గౌడ్ (36) గీత కార్మిక వృత్తిరీత్యా కాసిపేటలో భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. మల్లేశ్‌గౌడ్ శనివారం రాత్రి బోయపల్లి బోర్డు సమీపంలోని దాబాలో బిర్యానీ తీసుకున్నాడు. తిరిగి బైక్‌పై బోయపల్లి బోర్డు వైపు వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య రాధిక ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ప్రమాదవశాత్తు నీటమునిగి మహిళ..

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కాలేజీరోడ్‌లో గల గోదావరి నదిలో ఆదివారం స్నానం ఆచరించేందుకు వచ్చిన మహిళ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. సోమగూడెంకు చెందిన మద్దెల లక్ష్మి (54) తొలి ఏకాదశి సందర్భంగా గోదావరిలో స్నానం ఆచరించేందుకు వచ్చింది. ప్రమాదవశాత్తు నీటిలో మునిగింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి ఆధార్‌కార్డు పరిశీలించగా కోటపల్లి మండలం నాగంపేట్ అడ్రస్‌తో ఉంది. లక్ష్మి భర్త రాజలింగు సింగరేణి ఉద్యోగి అని తెలిసింది. కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

కార్మికుడికి గాయాలు..

జిల్లా కేంద్రంలో ఆస్పత్రి భవన నిర్మాణ పనుల్లో కార్మికుడికి తీవ్రగాయలైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పశ్చిమబెంగాల్‌కు చెందిన భానుదేవ్ ఆదివారం పనులు నిర్వహిస్తుండగా లిఫ్టు సహాయంతో రోప్‌ద్వారా బకెట్‌లో ఇటుకను 3వ అంతస్తుకు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు క్రేన్ రోప్ తెగింది. ఇటుక బకెట్ కిందపడడంతో భానుదేవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసాటౌన్: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాండ్రిగల్లికి చెందిన సయ్యద్ ముజీం(42) మేస్త్రి పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈక్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో, కుటుంబానికి భారం కావద్దనే ఉద్దేశంతో ఆదివారం కుంచావలి గుట్ట సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసులో కీలక నిందితుడు అరెస్ట్

నిర్మల్‌టౌన్: పట్టణానికి చెందిన ఇద్దరిపై ఇటీవల దాడికి పాల్పడి కిడ్నాప్ చేసిన ఐదుగురు సభ్యుల ముఠాలో కీలక నిందితుడైన ఇబ్రహీం బిల్డర్ అలియాస్ అబ్దుల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన తాహెర్ బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. అదేవిధంగా మహారాష్ట్రలోని ధర్మబాద్‌కు చెందిన షేక్ రౌఫ్, భైంసాకు చెందిన రహీజ్‌లు కూడా బియ్యం వ్యాపారం చేస్తున్నారు. వీరికి తాహెర్‌తో పరిచయం ఉంది. ఈక్రమంలో తాహెర్‌ను రూ.4 లక్షలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో తాహెర్‌ను కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నారు. భైంసాకు చెందిన ఇటుకల వ్యాపారి ఇబ్రహీం బిల్డర్‌కు రూ.1.50 లక్షల సుపారీ ఇచ్చారు. సల్మాన్, మహమ్మద్ సోహెల్ మరోఇద్దరితో కలిసి ఇబ్రహీంలు పట్టణంలోని బైల్ బజార్ వద్ద తాహెర్ వాహనాన్ని అడ్డుకుని అందులో ఉన్న డ్రైవర్లపై దాడి చేసి కిడ్నాప్ చేశారు. ఈ విషయమై డ్రైవర్ నుమాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక సోఫినగర్ ప్రాంతంలో ఇబ్రహీం ఉన్నాడని పక్కా సమాచారంతో ఈనెల 5న పట్టణ సీఐ దాడి చేశారు. స్థానిక దర్గా వద్ద అతన్ని అరెస్టు చేసి కత్తి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.


తప్పుడు పత్రాలతో ప్లాట్ విక్రయించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్ విక్రయించిన పట్టణానికి చెందిన జోగు రుపేందర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సులిగల్ల సునీత 2013లో రూపేందర్ వద్ద నుంచి రూ.11 లక్షలకు రిక్షా కాలనీలో ఓ ప్లాట్ కొనుగోలు చేసింది. ఆ తర్వాత సునీత ఆ ప్లాట్‌ను విద్యానగర్‌కు చెందిన ఉమేశ్‌రెడ్డికి విక్రయించింది. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తి ప్లాట్ వద్దకు వెళ్లగా, ఈ ప్లాట్ తనదని, రిజిస్ట్రేషన్ తన పేరిట ఉందని పత్రాలు చూపించాడు. దీంతో మోసం చేసి వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం సునీత ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తిపై..

ప్లాట్ విక్రయించి డబ్బులు తీసుకుని ప్లాట్‌ను చూపించకుండా మోసగించిన పట్టణంలోని అంకోలి రోడ్డు వైపు ఉండే సయ్యద్ షాహిద్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. 2008లో పంజేషా మొహల్లాకు చెందిన విఖార్ అహ్మద్ ఎస్‌ఏ రియల్‌ఎస్టేట్ వ్యాపారి వద్ద రూ.38వేలకు భీంసరి సమీపంలో ప్లాట్ కొనుగోలు చేశాడు. ప్లాట్ చూపించకుండా తిప్పుకుంటున్నాడు. ప్లాట్ వద్దకు వెళ్లి చూడగా, మరో వ్యక్తికి ఆ ప్లాట్‌ను విక్రయించినట్లు తెలిసింది. బాధితుడు మోసపోయాడని తెలుసుకుని ఆదివారం ఫిర్యాదు చేశాడు.

నకిలీ పత్రాలతో మోసగించిన మహిళపై..


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఫణిధర్

ఆదిలాబాద్‌రూరల్: నకిలీ పత్రాలతో మోసగించిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్ తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బృందావన్ కాలనీకి చెందిన దాసరి జ్యోతి గత మూడేళ్ల గేడం దేవిదాస్ జ్యోత్స్న దంపతులకు ఖానాపూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 68/100/2లో 764 నంబర్ గల (30Í40) సైజు ప్లాటు కొనుగోలు చేయించింది. ఆ తర్వాత రూ.3.30 లక్షలు వసూళ్లు చేసి నకిలీ పత్రాలతో తమను మోసగించిన దాసరి జ్యోతితోపాటు పలువురిపై జ్యోత్స్న ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం జ్యోతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహమ్మద్ కలీమ్‌తో పాటు పలువురు పరారీలో ఉన్నారు. సమావేశంలో ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల మృతికి కారకులైన ఇద్దరిపై..

ఆదిలాబాద్‌రూరల్: మావల బంజారాహిల్స్ శివారు ప్రాంతంలో రోడ్డుకు అనుకుని ఉన్న నీటికుంటలో ప్రమాదవశాత్తు పడి చిన్నారుల మృతికి కారకులైన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల మండల కేంద్రానికి చెందిన స్వామి, గీత దంపతుల కుమారులు వినూత్న (11), విదాత్ (10)లు శనివారం సైకిల్ ఆడుకుంటూ బంజారాహిల్స్ రోడ్డు గుండా వెళ్తున్నారు. మార్గమధ్యలో నిర్మల్కర్ భాస్కర్‌కు చెందిన భూమిలో ఉన్న నీటికుంటలో పడ్డారు. దీంతో వారు అక్కడికి అక్కడే మృతి చెందారు. అయితే ఆదిలాబాద్‌లోని భుక్తపూర్ కాలనీకి చెందిన యతేంద్రనాథ్ యాదవ్‌కు పట్టేదారు అభివృద్ధి, భూమి నిర్వహణ కోసం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా ఆ భూమిని ఇచ్చారు. వారి నిర్లక్ష్యంతోనే చిన్నారులు నీటికుంటలో పడి మృతి చెందారని ఆరోపిస్తూ మావల తహసీల్దార్ వేణుగోపాల్, మృతుల తండ్రి స్వామి ఇరువురు ఆదివారం ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బీసీ మేధావుల ఫోరం కార్యవర్గం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో బీసీ మేధావుల ఫోరం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా చీఫ్ కోఆర్డినేటర్‌గా శ్రీరాముల కొండయ్య, కోఆర్డినేటర్లుగా డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్, రంగు రాజేశం, కనుకుట్ల మల్లయ్య, షబ్బీర్ పాషా, సమ్ము రాజ య్య, కోడూరి చంద్రయ్య, అశోక్ యాదవ్, తునికి ప్రవీణ్, అక్కల నాగరాజు, జైనుద్దీన్, లింగమూర్తి, రవి ఎన్నికయ్యారు. రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు వారికి నియామకపత్రాలు జారీ చేశారు.

యూరియా కోసం బారులు


క్యూకట్టిన రైతులు


బారులు తీరిన మహిళలు

నార్నూర్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులు, మహిళలు బారులు తీరారు. 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలియడంతో ఆదివారం ఉదయం 5 గంటలకు వారు తరలివచ్చారు. మండలానికి 300 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు 100 మెట్రిక్ టన్నులు వచ్చిందని, సోమవారం మరో 50 మెట్రిక్ టన్నులు వస్తుందని సీఈవో అడే గణేశ్ తెలిపారు. సొసైటీ కేంద్రంలో ఉన్న 400 బ్యాగులు ముందు వరుసలో ఉన్నవారికే దొరికాయి. దీంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి సరిపడా ఎరువులు అందించాలని కోరుతున్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


సంతోష్ (ఫైల్)


సంతోష్ మృతదేహాన్ని అబుదాబి ఎయిర్‌పోర్టుకు తరలిస్తున్న గల్ఫ్ వెల్ఫేర్ ప్రతినిధులు

నర్సాపూర్(జి): ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని అబుదాబి వెళ్లిన మండలంలోని టెంబుర్నికి చెందిన బొగుడమీది సంతోష్ వారం రోజుల్లోపే మృతిచెందాడు. ఆదివారం స్వగ్రామానికి మృతదేహం చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బొగుడమీది సంతోష్ (36) గతనెల 22న విజిట్ వీసాపై దుబాయ్‌లోని అబుదాబి వెళ్లాడు. మరుసటి రోజు బయటికి వెళ్లి తిని వస్తానని చెప్పి గదికి తిరిగి రాలేదు. ఈ విషయాన్ని తోటి కార్మికులు గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ యూఏఈ ప్రతినిధి గడ్డంద నరేందర్‌కు సమాచారం అందించారు. ఆయన అబుదాబిలోని ఇండియన్ ఎంబసీకి సమాచారం చేరవేశారు. బాధిత వ్యక్తి విజిట్ వీసాపై వెళ్లి ఉండటంతో కంపెనీ వివరాలు సత్వరమే తెలియరాలేదు. అక్కడి గల్ఫ్ వెల్ఫేర్ ప్రతినిధులు ఆరాతీయగా గతనెల 27న మృతి చెందినట్లు ఎంబసీ అధికారులు వెల్లడించారు. స్వగ్రామంలో ఉన్నప్పుడు తెల్లకల్లు సేవించడం అలవాటు ఉన్న సంతోష్ అబుదాబి వెళ్లాక అది లభించకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి మృతి చెందినట్లు తెలిపారు. ఇండియన్ ఎంబసీ ద్వారా అక్కడి సంఘ ప్రతినిధులు శంకర్ లావుడ్యా, అబుదాబి సమన్వయకర్త కల్లెడ నరేశ్ ఆ మృతదేహన్ని స్వస్థలానికి పంపించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం స్వగ్రామానికి మృతదేహం చేరగా కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య ప్రేమల, కుమారుడు సాయి చరణ్, కూతురు నితీక్ష ఉన్నారు.

గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టాలి

గ్రామీణులకు ఆశ చూపి మంచి వేతనంతో అవకాశం కల్పిస్తామని గల్ఫ్ దేశాలకు విజిట్, టూరిస్ట్ వీసాలపై పంపుతూ ఏజెంట్లు చేస్తున్న మోసాలను అరికట్టాలని యూఏఈ గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం ప్రతినిధులు గడ్డంద నరేందర్, శంకర్, వంశీ గౌడ్, రవి, నరేశ్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో చేసే ఉద్యోగం పట్ల ముందుగానే పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే వెళ్లాలని సూచించారు.

కుంసరలో దొంగల హల్‌చల్


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. సొలంకి అబారావు, సులోచన, మాధవ్, సురేందర్‌రెడ్డి ఇళ్లలో దొంగలు చొరబడి బీరువాలను పగులగొట్టారు. నగదు, బంగారం దొరకకపోవడంతో సామగ్రిని చిందరవందరగా పారేశారు. సురేందర్‌రెడ్డి బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని స్థానికులు బాధితులు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సైలు శంకర్, సుప్రియలు ఆదివారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ పేర్కొన్నారు.

యువతి అదృశ్యం


అంకిత (ఫైల్)

తానూరు:మండలకేంద్రం పరిధిలో ఆదివారం యువతి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన సాక్రే అంకిత (18) అనే యువతి మూడు నెలలుగా హిప్పెల్లి గ్రామంలో వరుసకు చిన్నాన్న అయ్యే శివకుమార్ ఇంట్లో ఉంటోంది. ఆదివారం శివకుమార్ కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. చేను వద్ద కలుపు మొక్కలు తీసి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన అంకిత తిరిగి రాలేదు. చుట్టుపక్కల, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శివకుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

భైంసాటౌన్: పట్టణంలోని నర్సింహానగర్‌కు చెందిన కల్యాణ్‌కర్ శంకర్ (45) అనే వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శంకర్ ఇటీవల ఇంటిపై నుంచి మెట్లు దిగుతూ జారిపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలవగా కుటుంబీకులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న పుట్టగొడుగులు







తరచూ కురుస్తున్న వర్షాలకు గొడుగుల్లాంటి ఆకృతిలో ఉండే చిన్న,చిన్న పుట్టగొడుగులు సైతం పుట్టుకొస్తున్నాయి. వివిధ పరిమాణాల్లో, రూపాల్లో ఉండడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్, మహబూబ్ ఘాట్స్ సెక్షన్‌లో సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, నిర్మల్